ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు ‘పది’లం

- అత్యధిక మార్కులు సాధించి, సత్తా చాటిన విద్యార్థులు
- ఫలించిన ఉపాధ్యాయుల కృషి
- ప్రశంసించిన ప్రధానోపాధ్యాయులు

పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. అన్ని పాఠశాలల్లో మంచి ఫలితాలు రావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లి దండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో గాజువాక హైస్కూల్ ఉపాధ్యాయులు



నడుపూరు జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అక్కిరెడ్డిపాలెం: పదో తరగతి ఫలితాలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ఉత్సాహం నింపాయి. అత్యధిక మార్కులు సాధించడంతో అవధుల్లేని ఆనందంతో సంబరాలు చేసుకున్నారు. గాజువాక ప్రభుత్వ పాఠశాలలో 60శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని ప్రధానోపాధ్యాయుడు అరుణ్ కుమార్ తెలిపారు.ఎస్.వర్షిణి,షాజీనా,ఎస్.చంద్రిక మంచి మార్కులు సాధించారన్నారు. పాఠశాల నుంచి 426 మంది పరీక్షలకు హాజరు కాగా వీరిలో 236 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. 13 మంది 500 మార్కులు పైగా సాధించారన్నారు. అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థులను హెచ్‌ఎం , ఉపాధ్యాయులు అభినందించారు.

అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్లో 69శాతం..

అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాల 69 శాతం ఉత్తీర్ణతను సాధించిందని హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం తెలిపారు. పాఠశాల నుంచి 115 మంది పరీక్షకు హాజరు కాగా 79 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. 11 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారని చెప్పారు.

మింది హైస్కూల్లో 76 శాతం..

మింది జిల్లా పరిషత్ పాఠశాల 76 శాతం ఉత్తీర్ణతను సాధించిందని ప్రధానోపాధ్యాయుడు పి.వి.ఎస్.ఎస్.ఎస్.ఆంజనేయ తెలిపారు. పాఠశాల నుంచి 163 మంది పరీక్షకు హాజరు కాగా 125 మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. 18 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారని తెలియజేశారు.

కణితి పాఠశాలలో బాలికలదే పైచేయి

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం పరిధిలోని కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో బాలికలే పై చేయి సాధించారు. పాఠశాలలోని 266మంది విద్యార్థులకు గాను ఇద్దరు గైర్హాజరు కావడంతో 264 మంది పరీక్షలు రాశారు. వీరిలో 145 మంది ఉత్తీర్ణత సాధించారు. 146 మంది బాలురకు గాను 66మంది ఉత్తీర్ణత సాధించగా, 122మంది బాలికల్లో 79మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత సాధించిన వారిలో 19 మంది 500 పైగా మార్కులు సాధించడం విశేషం.

నడుపూరు పాఠశాలలో 61.4 శాతం..

పెదగంట్యాడ: నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 61.4 శాతం ఉత్తీర్ణత సాధించారు. 301 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 185 మంది ఉత్తీర్ణులయ్యారు.

- యారాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 32 విద్యార్థులు పరీక్షలు రాయగా 19 మంది ఉత్తీర్ణులయ్యారు.
- ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 120 విద్యార్థులు పరీక్షలు రాయగా 76 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ పాఠశాలలో మొత్తం 63.33 శాతం ఉత్తీర్ణత సాధించారు.
- గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 78 విద్యార్థులకు గాను 34 మంది ఉత్తీర్ణులయ్యారు. పాఠశాలలో 45 శాతం ఉత్తీర్ణత సాధించారు.

అగనంపూడి హైస్కూల్లో 72శాతం..

అగనంపూడి: అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 72శాతం ఉత్తీర్ణతను సాధించారు. 165మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 119 మంది ఉత్తీర్ణత సాధించినట్టు హెచ్‌ఎం కృష్ణారావు తెలిపారు.



షేక్ సబీర్ మొహిద్దీన్ అగనంపూడి హైస్కూల్



గీతా చరణ్ లంకెలపాలెం హైస్కూల్

లంకెలపాలెం హైస్కూల్లో 82శాతం..

లంకెలపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలకు 82 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత పొందినట్టు హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు తెలిపారు. మొత్తం 95 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 78 మంది పాసైనట్టు ఆయన తెలిపారు

ఐఐటీలో ఇంజినీరింగ్ చేస్తాను



మా నాన్న కూరగాయల వ్యాపారం చేస్తూ కష్టపడి చదివించారు. నేను బాగా చదవడానికి ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు రుణపడి ఉంటాను. భవిష్యత్తులో బాగా చదువుకుని ఐఐటీలో ఇంజినీరింగ్ చేయాలని ఉంది.

– నందకిషోర్, కణితి జెడ్పీ హైస్కూల్

ఉపాధ్యాయులు ఎంతో ప్రోత్సహించారు



మా నాన్నగారు అప్పారావు డైలీవర్కర్‌గా చేస్తున్నారు. నన్ను ఉపాధ్యాయులు ఎంతో ప్రోత్సహించారు. వారి సహకారమే లేకుంటే ఇన్ని మార్కులు సాధించేదాన్ని కాదు. భవిష్యత్తులో ఇంకా బాగా చదువుకుని ఇంజినీర్‌గా స్థిరపడాలనేది నా కోరిక.

–సోనియా, కణితి జెడ్పీ హైస్కూల్

మెకానికల్ ఇంజినీర్‌ని కావాలని..



నాన్న రాముడు స్టీల్ ప్లాంట్‌లో కాంట్రాక్ట్ వర్కర్.అమ్మ రేణుకావతి ఆశ వర్కర్. మా టీచర్లు ఎంతో ప్రోత్సాహం అందించారు. రోజూ ప్రత్యేక తరగతులకు హాజరై, బాగా ప్రిపేర్ అయ్యాను. మెకానికల్ ఇంజినీర్‌ని కావాలని ఆకాంక్ష. –సీహెచ్ రామ్‌చరణ్ కోటి, నడుపూరు హైస్కూల్

క్లుప్తంగా

టైలర్ కుటుంబానికి చేయూత



ఏడుకొండలు కుటుంబానికి సాయం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

అక్కిరెడ్డిపాలెం: రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన టైలర్ కుటుంబానికి విశాఖ జిల్లా టైలర్స్ అసోసియేషన్ ఆర్థిక సహాయం అందజేసింది. 68వ వార్డు అక్కిరెడ్డిపాలేనికి చెందిన డి.ఏడుకొండలు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై దుర్మరణం చెందాడు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న మృతుని కుటుంబానికి అసోసియేషన్ ప్రతినిధులు సమకూర్చిన రూ.23,200 నగదును మృతుని భార్యకు అందజేశారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు అతికినిశెట్టి సత్యనారాయణ, అధ్యక్షుడు కూనూరు మల్లికేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతికి ఏర్పాట్లు

పెదగంట్యాడ: స్థానిక బీసీ రోడ్డులోని భక్తాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 14న హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు కన్నేపల్లి సీతాపతిశర్మ తెలిపారు. ఆలయంలో పలువురు భక్తులు హనుమాన్ మాల ధరించారు. ఆయన మాట్లాడుతూ 14న స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేయనున్నామని చెప్పారు.

నేడు బీఎంఎస్ ఎల్-20 సదస్సు

అక్కిరెడ్డిపాలెం: భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ఎల్–20 జన భాగీదారీ సదస్సును ఆదివారం షీలానగర్ కిమ్స్ ఐకాన్ రోడ్డులో గల బీవీకె స్కూల్ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.జగదీశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఎంఎస్ జాతీయ అధ్యక్షుడు హెచ్.జే.పాండ్య పాల్గొననున్నట్లు తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు హెల్త్ కిట్లు పంపిణీ



కార్మికులకు హెల్త్ కిట్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లక్ష్మీబాయి

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధి కోరాడలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద పారిశుధ్య కార్మికులకు శనివారం హెల్త్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల కృషికి వెలకట్టలేమన్నారు. కార్యక్రమంలో వార్డు నాయకులు పులి వెంకటరమణారెడ్డి, డొమ్మేటి సోమినాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నర్సింగరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



గంగాధర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న భెల్ ఎస్సీ, ఎస్టీ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ రామచంద్రాపురం యూనిట్‌లో ప్లాంట్ కౌన్సిల్ కో–చైర్మన్, ఇంటక్ నాయకుడు బి.గంగాధర్‌ను ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్, బీఈఆర్‌పీటీయూ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ నుంచి విశాఖ పర్యటనకు వచ్చిన ఆయన్ను కలిసిన నాయకులు ఎస్సీ, ఎస్టీ కార్మికుల, ఉద్యోగుల సమస్యలను వివరించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ప్రధాన కార్యదర్శి కొల్లి దేముడు, ఎం.ముసిలిరెడ్డి, బి.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల చెస్ పోటీలు ప్రారంభం



చెస్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, బీజేపీ నేత నర్సింగరావు

పెదగంట్యాడ: దివ్యాంగుల్లో ఎంతో నైపుణ్యం ఉంటుందని, వారిలో ఉన్న ప్రతిభకు పదును పెట్టేందుకు ఇటువంటి పోటీలు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఏబీసీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ స్వరూప్ ఆధ్వర్యంలో స్థానిక వికాస్‌నగర్ ఇండోర్ స్టేడియంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన దివ్యాంగుల కోసం రెండు రోజుల పాటు చదరంగం పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీలను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శనివారం ప్రారంభించారు. రెండు రాష్ట్రాల నుంచి 170 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులకు తమ వంతు ప్రోత్సాహం ఉంటుందని చెప్పారు. క్రీడల్లో పాల్గొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, ఏఎస్ఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ అధినేత ఏఎస్ఆర్, జయరాజ్, రాకేష్, రంజిత్, నాని, సాయి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈశ్వరాంబ జయంతి



కుట్టు మిషన్లు అందజేస్తున్న విస్టీల్ మహిళా సమితి అధ్యక్షురాలు నుపుర్ భట్

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి మందిరంలో ఈశ్వరాంబ దినోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సత్యసాయి మాతృమూర్తి ఈశ్వరమ్మ జయంతి సందర్భంగా శనివారం నిర్వహించిన వేడుకలు వేకువజామున ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తనతో ప్రారంభమయ్యాయి. అనంతరం మందిరంలో రుత్వికుల ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం, రుద్రాభిషేకాలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బాలవికాస్ పిల్లలు తమ పిల్లలకు పాదపూజ చేశారు. బాలవికాస్ పిల్లలచే వేద పఠనం, అష్టోత్తరం, భజనలు జరిగాయి. సేవా కార్యక్రమాల్లో భాగంగా రాసాలమ్మ కాలనీకు చెందిన ఇద్దరు పేదల మహిళలకు విస్టీల్ మహిళా సమితి అధ్యక్షురాలు నుపుర్ భట్ చేతుల మీదుగా కుట్టు మిషన్లు అందజేశారు. నారాయణ సేవలో భాగం 300 మందికి ఆహార ప్యాకెట్లు అందించారు. బాలవికాస్ పిల్లల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సమితి విద్యా విభాగం సమన్వయకర్త జయశ్రీ గణేశన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అగనంపూడి వైద్యురాలు జె. భారతి, సమితి కన్వీనర్ జి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో పేదలకు న్యాయం



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో పేద, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 69వ వార్డు తుంగ్లాంలో శనివారం సాయంత్రం ఆయన పర్యటించారు. ప్రతీ ఇంటికి వెళ్లి లబ్ధిదారులను కలిశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించి, కరపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు న్యాయం జరిగిందన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో ఉన్నత పదవులు కల్పించిన గొప్ప నాయకుడని కొనియాడారు. వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, నాయకులు కాకి అప్పల రెడ్డి, అంగ బాబూరావు, విరోతి రాము, సాలాపు వెంకటరావు, మళ్ల కుమార్, గిడితూరి పోలిరాజు, సామోజి అప్పలాచారి తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధనకు ఆర్థిక సాయం



ఆహారం అందజేస్తున్న అప్పలరాజు కుటుంబం

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ అయ్యప్ప స్వామి ఆలయంలో నిత్య శనివారం అన్నసమారాధనను ఘనంగా నిర్వహించారు. గాజువాకకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త దొడ్డపురెడ్డి అప్పలరాజు, సన్యాసమ్మల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కుమారుడు సాయి శ్రీనివాస్ అన్నసమారాధనకు రూ.13 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎస్.ఏ.నాయుడు, కార్యదర్శి పి.వి.శేషగిరిరావు, బి.పైడిరాజు, వీరారావు, అప్పారావు, ఎస్.విశ్వేశ్వరరావు, చరపాక నాగార్జున రాజు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల రక్షణ చట్టంపై శిక్షణ తరగతులు



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వినియెగదారుల సంఘం చైర్మన్ సత్యనారాయణ

కంచరపాలెం: ఐటీఐ జంక్షన్‌లోని జిల్లా వినియోగదారుల సంఘం సమైక్య కార్యాలయంలో సంఘ చైర్మన్ మర్రి సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం వినియోగదారుల రక్షణ చట్టంపై ఇంటర్న్‌షిప్ శిక్షణ తరగతులు నిర్వహించారు. జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు. సత్యనారాయణ మాట్లాడుతూ కోర్టు అంటే భయపడేవారు, చదువురాని వారికి వినియోగదారుల సంఘం ఎంతగానో సేవలందిస్తుందని చెప్పారు. విద్యార్థి దశ నుంచే వినియోగదారుల రక్షణ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

టెన్త్ ఫలితాల్లో భాష్యం సత్తా



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, యాజమాన్యం

అక్కిరెడ్డిపాలెం: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గాజువాక బ్రాంచ్ భాష్యం విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారని విద్యా సంస్థల డైరెక్టర్ భాష్యం రామకృష్ణ తెలిపారు. విజయానికి కారణమైన ఉపాధ్యాయులకు, సిబ్బందికి, సహకారం అందించిన తల్లిదండ్రులకు భాష్యం విద్యాసంస్థల సీఈవో ఎం.సత్యం, జోనల్ ఇన్‌చార్జి జి.వి.ఆంజనేయులు అభినందనలు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌లో ఎత్తు నుంచి పడిన కాంట్రాక్టు కార్మికుడు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్‌లో విధి నిర్వహణలో ఉన్న ఓ కార్మికుడు శనివారం ఎత్తు నుంచి కింద పడిపోయాడు. ప్రత్యక్షసాక్షుల కథనం మేరకు వివరాలివి.. కాంట్రాక్టు కార్మికుడు కులుకూరి కృపావరం (50) యథావిధిగా విభాగంలో పనులు చేస్తుండగా జారి ఎత్తు నుంచి కింద పడిపోయాడు. ఈ సంఘటనలో అతనికి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఉక్కు జనరల్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

నూతన వేతనాల అమలుకు చర్యలు తీసుకోవాలి



తపన్‌సేన్‌కు వినతిపత్రం అందజేస్తున్న యువ కార్మికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల నూతన వేతనాల అమలుకు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్‌ను స్టీల్ ప్లాంట్ యువ కార్మికులు కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయానికి శనివారం రాత్రి విచ్చేసిన తపన్‌సేన్‌ను కార్మికులు కలిసి వినతిపత్రం అందజేశారు. సెయిల్‌లో వేతన ఒప్పందం జరిగి ఏడాదిన్నర అవుతున్నా ఇక్కడ అమలు కావడం లేదన్నారు. కార్మికుల వేతన సవరణపై డీపీఈ గైడ్‌లైన్స్ అడ్డంకి అంటూ చెబుతుండటం అన్యాయమని తెలిపారు. వేతన అమలు జాప్యం వల్ల యువ కార్మికులుగా తాము పడుతున్న కష్టాలను ఆయనకు వివరించారు. దీనిపై తపన్‌సేన్ సానుకూలంగా స్పందించి, తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్టు కార్మికులు తెలిపారు.

బాల వికాస్ చిన్నారులకు బహుమతులు



మాట్లాడుతున్న సత్యసాయి భజన మండలి ప్రతినిధులు

అగనంపూడి: దేశ చరిత్రలో తమకంటూ ఒక స్థానాన్ని దక్కించుకునే మహానుభావులు ఉంటారని, అటువంటి వారిలో సత్యసాయి బాబా ఒకరని అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి అన్నారు. ఆయన మాతృమూర్తి ఈశ్వరమ్మకు కూడా ఆ గౌరవం దక్కుతుందన్నారు. ఈశ్వరమ్మ పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 1వ తేదీ నుంచి ఆరు రోజుల పాటు పెదమడక కొండయ్యవలస మరిడిమాంబ ఆలయంలో బాల వికాస్ బాలలకు వివిధ పోటీలు నిర్వహించారు. విజేతలకు శనివారం బహుమతులు అందించారు. కార్యక్రమంలో హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ శివానీ జ్యోతి, బాల వికాస్ ప్రతినిధి సాయి సంపత్, సేవా సమితి కన్వీనర్ జి.రామకృష్ణ, విందుల పైడినాయుడు, అల్లం శ్రీనివాసరావు, విందుల వరహాలు తదితరులు పాల్గొన్నారు.

87వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- రూ.19.89లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ
- 5 చేతిబోర్లు ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధిలోని పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. రూ.19.89లక్షలతో టీజీఆర్ నగర్ నుంచి సిద్ధార్థ నగర్ పంప్‌హౌస్ వరకు సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వినతి పత్రాల ఆధారంగా 6.18 లక్షల వ్యయంతో పూర్తి చేసిన 5 చేతిబోర్లను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో శరవేగంతో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. విశాఖపట్నాన్ని పరిపాలన రాజధానిగా అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ పి.సింహాచలం, 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్, వైఎస్సార్ సీపీ వార్డు ఇంచార్జ్ కోమటి శ్రీనివాసరావు, ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవింద్, ఏఈ కేదారనాథ్, బలిరెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో కార్మిక చట్టాలు నిర్వీర్యం

- అఖిల భారత సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్
- ఉక్కు రిలే దీక్షకు సంఘీభావం



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: శ్రామికుల కష్టనష్టాలను పట్టించుకోకుండా కార్పొరేట్ కంపెనీల యజమానులకు కొమ్ము కాస్తూ, బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందని అఖిల భారత సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ విమర్శించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 814వ రోజు శనివారం కోక్‌ఓవెన్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తపన్‌సేన్ మాట్లాడుతూ విభజన హామీలను విస్మరించి రాష్ట్రాన్ని అన్ని విధాల నష్టాల్లోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలన్నారు. ప్రైవేట్ కంపెనీలు అప్పులు చేసి తిరిగి కట్టకుండా ఎగ్గొడితే వాటిని రుణమాఫీ పేరుతో మాఫీ చేస్తున్నారని విమర్శించారు. ప్రాణత్యాగాలతో ఏర్పడిన విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం కానివ్వబోమన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించేలా ప్రజలను చైతన్యం చేసే విధంగా కార్మికులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు పాటించాలి

బీచ్‌రోడ్డు: ప్రతి ఒక్కరు ఇంధన వినియోగం తగ్గించుకొని భవిష్యత్తు తరాలకు కొరత లేకుండా చూడాలని గెయిల్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ ఎల్ఎస్ రావు పిలుపునిచ్చారు. సాక్షమ్ వాకథాన్ పేరుతో ఇంధన పొదుపుపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం ఆర్కేబీచ్‌లో నిర్వహించారు. ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ వాక్‌థాన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎల్ఎస్‌రావు మాట్లాడుతూ ఇంధన విని యోగం తగ్గించుకునేందుకు నడక, సైక్లింగ్, ప్రజా రవాణా వినియోగించాలన్నారు. భారత దేశం అత్యధికంగా ఇంధనాన్ని దిగుమతి చేసుకోవడం జరుగుతుందన్నారు. కాబట్టి ఇంధన వినియోగం తగ్గించి దేశ ఆర్థిక వ్యవస్థకు అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలువుర్ని సత్కరించారు. వాక్‌థాన్‌లో పెద్ద సంఖ్యలో యువతీ యువకులు పాల్గొన్నారు.

చమురు దిగుమతులను తగ్గించాలి

ముడి చమురు దిగుమతులపై మన దేశం ఆధారపడడాన్ని తగ్గించాలంటే ఇంధన పొదుపు చాలా అవసరమని హెచ్‌పీసీఎల్ డీజీఎం (సేల్స్) మురళీకృష్ణ అన్నారు. సాక్షమ్ పేరుతో హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో శనివారం బీచ్ రోడ్డులో అవగాహన ర్యాలీను నిర్వహించారు కార్యక్రమంలో సుందర వదన్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

